## జారి ఖరీదు

తన స్నేహితురాలు పద్మ వాళ్ళ చంటిపాపకి ఆరోగ్యం సరిగా లేదంటే చూడటానికి వెళ్ళింది మంజుల. ఆమె వెళ్ళేటప్పటికి పాపను సముదాయిస్తూ అవస్థ పడుతూంది పద్మ. పాప బిగ్గరగా ఏడుస్తూ కాళ్ళు చేతులు కొట్టు కుంటుంది. విరేచనాలు ఎక్కువగా అయి బాగా నీరసించి పోయింది. ఆకలిగా వుందో' కాబోలు! ఎంత సముదాయించినా ఊరుకోవడం లేదు. ఒకటే ఏడుపు. పాపం పద్మకి ఆ పాప పుట్టిన తరువాత ఒక ముక్క కూడా పాలు పడలేదు. రోజూ పోత పాలు



పోయ్యాల్సి వస్తోంది. పాల డబ్బాలో పాలై పోయిందని చెప్పింది పద్మ. వాళ్ళాయన దాని కోసమే బయటికి వెళ్ళాడట. పాప ఆకలి చూడలేక తన వొళ్ళోకి తీసుకుని తన రొమ్ము పట్టింది మంజుల. కడుపు నిండగానే హాయిగా నిద్రపోయింది పాప. కాసేపు కూర్చొని ఇంటికి వచ్చింది. ఇంటికి రాగానే మంజుల బాబు పాలకోసం తల్లిని చేరాడు. ఆప్యాయంగా వాడి నోటికి స్తన్యం ఆందించింది. పద్మ అవస్త చూచాక తల్లికి పాలుపడడం కూడాఅదృష్టంగానే భావించింది మంజుల. చుక్కలంటే ఈనాటి ధరలతో డబ్బా పాలుకూడా ఎంతో భారం. అప్పుడు గుర్తుకొచ్చింది ఆమెకి, అదే స్తన్యంతో జబ్బు పడ్డ పద్మ పాపకి కూడా పాలిచ్చినట్లు. నీళ్ళతో శుభ్రంగా రొమ్ము తుడుచుకోకుండా బాబుకి పాలిచ్చినందుకు ఒక్క క్షణం బాధ పడింది. దాని ఫలితం! మరు రోజు నుండి మంజుల వాళ్ళ అబ్బాయికి ఒకటే విరోచనాలు! వారం రోజుల తరువాత డాక్టర్ ఫీజు క్రింద మూడు వందలు సమర్పించి హాస్పటల్ నుండి బయటపడ్డారు మంజుల దంపతులు.

— డి.ఎ.సత్యనారాయణ



### నాగు

నాపేరు నాగు. నేనెన్నో మర్డర్లు చేసాను. చాలాసార్లు రహస్యంగా చేసాను. కానీ కొన్నిసార్లు విధిలేక నడిరోడ్డుమీద చేసాను. నా ధాటికి ట్రాఫిక్ అంతా ఆగిపోయింది. కానీ ఒక్కడూ

## కాలమ్‌దాటని కథలు

నోరెత్త లేదు. అందరూ ఆశ్చర్యంతో, ఆనం దంతో చూసేవాళ్ళే. పోలీసులు సైతం నన్నేమీ చేయలేరు. ఈ కోర్టులు, చట్టాలు అంటే నా కసలు లెక్కేలేదు. నేనెన్నో మానభంగాలు కూడా చేసాను. కానీ ఒక్కడు... ఒక్కడంటే ఒక్కడుకూడా నన్ను పల్లెత్తుమాటనలేదు. నేనెంతోమందికి ధన సహాయం చేసాను. ఎంతో మంది రోగుల ప్రాణాలు కాపాడాను. ఎంతో మంది నిరపరాధుల్ని కోర్టుబారి నుండి రక్షించాను. కార్మికుల తరపున యాజమాన్యంతో పోరాడాను. అయినా ఎవరూ నన్నేమీ చేయలేరు. అటువంటి నన్ను ఈ రోజు నలుగురు పోలీసులు బంధించి, రోడ్డువెంట లాక్కెళ్ళడమా...... సారీ! మిమ్మల్నందరినీ కన్‌ఫ్యూజ్ చేసాను కదా! నేనిపుడిపుడే వృద్ధిలోకొస్తున్న ఓ సినిమా యాక్టర్ని. ఆ! షాట్‌కు టైమైందీ! మరి వెళ్ళి రానా! గుడ్‌బై!

—పి.ప్రదీప్

## కట్టు గుడ్డల్లేని కర్షకుడు

పడమర దిక్కున సూర్యుడు ఎర్రబడ్డాడు అయినా అప్పలయ్య దున్నటం మానలేదు. వంటి మీద చెమట బిందువులు నిలిచాయి. వాడి కళ్ళలో అలసట అలముకొంది. వాడి చేతులు బొబ్బలెక్కాయి.

దున్నిన భూమిలో పత్తిగింజలు నాటాడు. ఎరువులు అరువుగా తెచ్చి జల్లారు. మంచి పంట పండాలని ఊరి దేవత పోలేరమ్మకు మేకని బలిచ్చాడు.

కాలం గిర్రున తిరిగింది. అప్పుడు ఓ రోజు ప్రొద్దున



గంజినీళ్ళు తాగి పొలానికి బయలు దేరాడు. ప్రత్తి చెట్లు ఏపుగా పెరిగి ప్రత్తి విరగకాసింది. ఇక నాల్గురోజులుంటే ప్రత్తిని కోయవచ్చు అనుకొన్నాడు. నిప్పులు చెండే ఎండవాడి ఒంటిని కాలుస్తోంది. అయినా ప్రత్తి పంట సంరక్షణ వాడు మానలేదు. ఆ రోజు వాడి కళ్ళలో మెరపు మెరిసింది. పంట కోశాడు. తీసిన ప్రత్తి అమ్మగా రూ 400 లు మాత్రం వచ్చింది. మరలా పంట వెయ్యడానికి వాడు డబ్బుని దాచాడు. ప్రత్తి పండించినా, ఆ ప్రత్తితో తయారయ్యే మంచి బట్టను కట్టుకోలేక పోతున్నాడు. పట్టెడు మంచి అన్నం తినలేక పోతున్నాడు. ఇది భారత దేశంలోని ఓ కర్షకుని కథనం.

అది ఓ మహానగరం. ఆకాశాన్ని అంటే అంతస్థులున్న ఓ హొటల్లో ఒక మిల్లు బట్టల ఆఫీసర్ల సమావేశం జరుగుతోంది. గది అద్దె ఒక రోజుకి వెయ్యి రూపాయిలు. భోజనం 1కి 100 రూపాయిలు. ఆ సాయంత్రం త్రాగుడు ఖర్చు-1800 రూపాయిలు. వారి శరీరాల మీద 1500 రూపాయిల ఖరీదు చేసే కోట్లు. హోటల్ లైట్లు జిగేల్ మంటున్నాయి. ఆ కంపెనీ యజమాని 'లాభాల' జోరులో విలాసంగా "ఛీర్స్" అన్నాడు.

కానీ, అక్కడ-నిప్పులు చెరిగే ఎండలో, గంజినీళ్ళే త్రాగి, వంటిపై గుడ్డలు కూడా లేకుండా, మరనాగలి పట్టుకు దున్నుతూనే ఉన్నాడు ప్రత్తి పండించే రైతు ఓ బడుగు జీవి. ఇదేమీ పట్టనట్టు పడమర సంధ్యారాగం ప్రఫుల్లంగా ఉంది.

—కె.మురళీమోహన్